

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా


JAI BHEEM TV GROUP OF ORGANISATIONS

01. Jai Bheem Telugu Daily News paper
02. Jai Bheem Enterprises
03. Jai Bheem Outsourcing Agency
04. Jai Bheem Payback to Society
05. SC Journalist Welfare Society
06. Jai Bheem Marraige Burao
07. Jai Bheem Business Development
08. Jai Bheem TV Puraskar Award
09. Jai Bheem Chitfund
10. Jai Bheem Dhalam Sena
11. South India Journalist Union

సంపుటి - 07 | సంచిక 62 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 01, ఫిబ్రవరి 2026 | పేజీలు 5 | వెల రూ. 2

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్







# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 62 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 01, ఫిబ్రవరి 2026 | పేజీ 2 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# దందాకోరులకు.. దత్తతివ్వండి





వ్యవస్థలను దోచుకునేటోళ్లకు పుష్కలంగా సౌలతులు లభిస్తున్నాయి

అధికారం అంటేనే దోచుకునుడు

సేవ చేద్దామన్న సోయి ఎవ్వనికి లేదు

పడిచస్తూ పస్తులుండెటోళ్ల సొమ్మును పందికొక్కుల మేస్తున్నారు

ఆస్తుల సంపాదన ఆదాయ పెంపు ఇదేనా బతుకు

మానవత్వం లేకపోయినా పర్వాలేదు కనీసం మనిషిలానైనా బతకాలి

అధికారిక ఆధారాలతో నేరుగా దోచుకుంటున్నారు

వ్యవస్థలను ఎంతలా దిగజారుస్తున్నారో అధికారులకే వదిలేయాలి

పదవుల కోసం పైసలు పెట్టడం పైసల సంపాదన కోసం పదవులు దక్కించుకోవడం

దోచుకున్నోనిదే రాజ్యం దాసుకున్నోదే కాలం

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దోసుకున్నోళ్లకు దోసుకున్నంత అనే సిద్ధాంతపరమైన నియమాలు ప్రతి ప్రభుత్వ శాఖలో కొనసాగుతున్నాయని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా విమర్శించారు.ప్రభుత్వ శాఖలను దోపిడీదారుల వ్యవస్థలుగా తయారు చేస్తున్న వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వాలు తీరుమారని పరిపాలనను కొనసాగించడం ఆశ్చర్య యుక్తంగా ఉందన్నారు.ఒకవైపు ఉన్నతాధికార హోదాలో ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలను గుత్త పట్టుకున్నట్లుగా దోసుకుంటున్నారని నేరుగా అధికారిక కార్యాలయాల ఆధారంగా లేఖలు, ప్రొసీడింగ్స్ లాంటివి బహిరంగంగా టెండర్ల రూపంలో ఆధారాలను వెల్లడిస్తూ దందాదారులుగా చందాలను తీసుకుంటున్నారని తీవ్రంగా హెచ్చరించారు. ఒకవైపు దేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రతిష్టాత్మకమైన నిర్ణయాలను ఉత్తర్వరుల రూపంలో విడుదల చేసే క్రమంలో ప్రపంచవ్యాప్తంగా వీక్షించే వెసులుబాటును కల్పిస్తూ వాదోపవాదనులను ప్రజాక్షేత్రంలో ఉంచుతుండగా దేశవ్యాప్తంగా నడుస్తున్న ప్రభుత్వ శాఖలు మాత్రం ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించబడుతున్న ఆధారాలను గోప్యంగా రహస్యంగా ఉంచడం తీవ్రమైన మోసంగా పరిగణించాల్సి

- మిగతా 2లో..



## వైభవంగా, సంప్రదాయబద్ధంగా ముగిసిన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర 2026

### వనంలోకి వన దేవతలు

మేడారం, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్)

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఆధ్యాత్మిక ఉత్సవంగా ఖ్యాతి పొందిన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర 2026 భక్తి, సంప్రదాయం, విశ్వాసాల సమ్మేళనంగా అత్యంత వైభవంగా ముగిసింది. పోరాటం, త్యాగం, నమ్మకాలతో ముడిపడిన ఈ మహాజాతరలో వన దేవతలు సమ్మక్క, సారలమ్మ శనివారం సాయంత్రం 7 గంటల 55 నిమిషాలకు గద్దెలను వీడి వనప్రవేశం చేయడంతో జాతర ఘనంగా పరిసమాప్తమైంది. వేలాది మంది భక్తుల జయజయధ్వానాలు, మంగళవాద్యాలు, భక్తిగీతాల మధ్య అమ్మవార్లు గద్దెలను విడిచి చిలకలగుట్ట, కన్నెపల్లి వైపు పయనమయ్యారు. ఈ ఘట్టం ప్రతి భక్తుని హృదయాన్ని కదిలించింది. "వన దేవతలు వనం లోకి" అంటూ భక్తులు కన్నీళ్లతో కూడిన వీడ్కోలు పలికారు. ఈ సమయంలో మేడారం ప్రాంతం అంతా ఆధ్యాత్మిక పరవశంతో నిండిపోయింది. ఈ

- మిగతా 2లో..



## మేడారంలో భక్తుల ఇక్కట్లు

బస్టాండ్‌లో ఉధృతమైన ఆందోళన

"ఇది జాతరాడ లేక శిక్షా?" అంటూ ప్రభుత్వంపై మండిపడిన భక్తులు



4

## ఎస్‌బీఐలో 2,273 ఉద్యోగాలు

బ్యాంకింగ్ అనుభవం ఉన్నవారికి భారీ అవకాశం

3

## మేడారం జాతరపై తీవ్ర విమర్శల వెల్లువ

ప్రెస్‌మీట్ రద్దుతో ప్రభుత్వ వైఫల్యం బహిర్గతం



3

## బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా మన అభ్యర్థులు ఉండాలి: రేవంత్ రెడ్డి

### అమెరికా నుంచి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్ రెడ్డి
### మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న ముఖ్యమంత్రి
### అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచన

హైదరాబాద్, జై భీమ్ న్యూస్



బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# దండాకోరులకు దత్తతివ్వండి

మొదటి పేజీ తరువాయి

ఉందన్నారు.ఆదయ శాఖకు సంబంధించిన విషయాల్లో నైతే మరింత లోతైన కోణంలో ఆధారాలు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతుండడం అధికారుల అవినీతికి అద్దం పట్టేలా ఉంటుందన్నారు.అభివృద్ధి కార్యక్రమాల పేరు మీద నిర్వహించబడుతున్న టెండర్లలో అధికారికంగా పర్సంటేజ్ ల రూపంలో భారీ సొమ్మును అధికారులు చేతివాటంగా పొందుకుంటూనే అనధికార హోదాలో బినామీల పేర్ల మీద మరింత సొమ్మును రాబట్టుకుంటున్నారన్నారు.ప్రభుత్వాలే అధికారికంగా టెండర్లు నిర్వహించడం ప్రభుత్వాలకు అనుకూలమైన వ్యక్తులకు టెండర్లను కట్టబెట్టడం ఒకరకంగా అధికారం అనేది వ్యాపారం లాగా ప్రజా సొమ్మును పెద్ద స్థాయిలో దుర్వినియోగ పరుస్తున్నారన్నారు.ప్రభుత్వ వ్యవస్థలను ప్రభుత్వ యంత్రాంగాలను ప్రజాభివృద్ధిని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటూ పాలించాల్సిన ప్రభుత్వాలు అభివృద్ధి అనే పదం అడ్డం పెట్టుకొని టెండర్ల పనులను దగ్గరుండి నడిపిస్తున్నారన్నారు.ప్రభుత్వ అధికారులు మరొకడుగు ముందుకేస్తూ అధికారిక హోదాలో స్థాయికి మించి సంపాదిస్తూ సంపాదించిన సొమ్మును నాయకులకు పై అధికారులకు పంచుతూ తిరిగి అధికారిక హోదాలో మరోచోట అధికారం దక్కించుకోవడం కోసం లాలూచీలు పడాల్సిన అవసరాలకు అలవాట్లు పడుతున్నారన్నారు.

దండే ప్రధానం దానం శూన్యం..

ప్రభుత్వ అధికార హోదాలను అడ్డం పెట్టుకొని అక్రమంగా సంపాదించుతున్న ఉద్యోగులంతా దందాల రూపంలో సంపాదించకుంటున్న సొమ్మును చందాల రూపంలో దానాల రూపంలో పేదవాళ్లకు సహాయపడైన ఆత్మబిమానాన్ని చాటుకుంటారేమోనని పేదవాళ్లు ఎదురు చూస్తుండగా వాటికి తగని రీతిలో సాధ్యమైనంత మేర సంపాదనకే మొదటి ప్రాధాన్యతనిస్తూ దందా రూపాన్ని దత్తతగా మలుచుకుంటున్నారని క్షేత్రస్థాయి విమర్శలు గుప్పించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న పరిపాలన విధానాల వల్ల మధ్యతరగతి కుటుంబీకులు పేదవాళ్ళు అయిపోతుండగా పేదవాళ్లు నిరుపేదలై పోతూ ఆకలి దప్పికలతో అన్నం మెతుకుల కోసం ఆరాటపడాల్సిన పరిస్థితిలు వేగంగా తలెత్తుతున్నాయి అన్నారు.అమాయకంగా, నిశ్శబ్దంగా, వ్యవహరిస్తున్న అధికారులంతా ప్రభుత్వ వ్యవస్థలపై ప్రభుత్వ సొమ్మును కుమ్మేస్తూ ప్రభుత్వ ఖజానాలను డ్యూటీ పేర్ల మీద లూటీ చేస్తున్నారని దానివల్ల ప్రభుత్వ సొమ్ము ఖాళీ అవుతుందన్నారు. డబ్బులు సంపాదిస్తున్న అధికారులు అంతా రాజకీయాల వైపు వెళుతుండగా అధికంగా డబ్బులు సంపాదించిన రాజకీయ నాయకులు విదేశాల పర్యటనలు అంటూ ప్రజల సొమ్ముతో దేశ విదేశాలు చుట్టోస్తున్నారన్నారు.ఒకవైపు ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగులకు లక్షలకు మించి జీతాలు చెల్లిస్తుంటే ప్రభుత్వ అధికారులు ప్రభుత్వాలు చెల్లిస్తున్న జీతాలతో సరిపెట్టుకోకుండా కనీసం కోట్ల రూపాయలను సంపాదించుకుంటే గాని జీవితాలు ధన్యమయ్యేలా లేవని రీతిలో ఫీలవుతున్నారన్నారు.అధికారం అంటేనే ధన సంపాదన.....ధన సంపాదన కోసమే అధికార పదవులు సంపాదించుకోవడం లాంటివి ప్రస్తుత కాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వ అధికారులకు వ్యసనం లాగా మారిపోయాయి అన్నారు.ప్రభుత్వ వ్యవస్థలను కాపాడుకోవాలనే ధ్యాస కన్నా పైసలు సంపాదించాలనే ద్యాసే ఎక్కువైపోతుందన్నారు.అక్రమాస్తి దారులంతా ఏకమై సమాచార హక్కు చట్టాన్ని సమూలంగా నిర్మూలించాలనే కుట్రలు పన్నుతున్నట్లుగా స్పష్టమైన సాంకేతాలు కనిపిస్తున్నాయన్నారు.అధికార రూపంలో స్త్రీ, పురుష భేదం లేకుండా పైస సంపాదనే ప్రాణం కన్నా ఖరీదైనదనిగా బావిస్తూ వాటన్నింటిని రుజువు చేయడం కోసం డబ్బు సంపాదనను జేబు సంపాదనగా భావిస్తూ సంపాదన ఎక్కువైనా కొద్దీ ప్రతి అధికారికి బినామీ దారులు పెంచి పోషిస్తున్నారన్నారు.ఎంత దోచుకుంటే అంత గొప్పోల్లుగా ఎంత అవినీతికి పాల్పడితే అంతటి అధికార పదవులకు అర్హులుగా ఎన్ని అక్రమాలు చేస్తే అంతటి శక్తి సంపన్నులుగా ఎదుగుతుండడం నేటి ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల ఆగడాలు నిత్యవసర వ్యాపారాలలాగా కొనసాగుతున్నాయన్నారు. దౌర్జన్యంగా నైనా దాడులు చేసైనా,అధికారిక హోదాను అడ్డం పెట్టుకొని అణిచివేతను పాటిస్తూనైనా పైసల సంపాదనకే ప్రాముఖ్యతనిచ్చే ప్రభుత్వ అధికారులు 100కు 95 శాతం అంతా కలిసి ఒకే మార్గంలో నడుస్తున్నారన్నారు.

## అపర భగీరథులు.. ఆపదలో అండగా నిలిచిన 'ఖాకీ'లు!

శాయంపేట పోలీసుల మానవత్వం అర్ధరాత్రి వాహనం బాగు చేసి కుటుంబానికి భరోసా



**శాయంపేట, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన పోలీసింగ్ అని శాయంపేట పోలీసులు మరోసారి నిరూపించారు. అర్ధరాత్రి దట్టమైన చీకటిలో, అపరిచిత అడవి మార్గంలో వాహనం చెడిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న ఒక కుటుంబానికి భరోసా ఇచ్చి, స్వయంగా మెకానిక్‌లుగా మారి వాహనాన్ని బాగు చేసి సురక్షితంగా గమ్యానికి చేర్చిన సంఘటన ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. తొర్రూరు పట్టణానికి చెందిన వరిపల్లి కుటుంబ సభ్యులు మేడారం సమ్మక్కసారలమ్మల దర్శనం ముగించుకుని స్వగ్రామానికి తిరుగుతూ శాయంపేట పరిసరాల్లో రాత్రి సుమారు 11 గంటల సమయంలో సాంకేతిక లోపం కారణంగా వారి వాహనం అకస్మాత్తుగా ఆగిపోయింది. చుట్టూ చిమ్మచీకటి, పరిచయం లేని అడవి ప్రాంతం కావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న శాయంపేట పోలీస్ సిబ్బంది శ్రీనివాసు, ఖలీల్ ఆగి ఉన్న వాహనాన్ని గమనించి వెంటనే అక్కడికి చేరుకున్నారు. బాధితులను పలకరించి ధైర్యం చెప్పిన వారు, వాహనంలో తలెత్తిన చిన్నపాటి సాంకేతిక లోపాన్ని గుర్తించి స్వయంగా దాన్ని సరిచేశారు. వాహనం స్టార్ట్ అయ్యే వరకు అక్కడే ఉండి, కుటుంబం సురక్షితంగా ప్రయాణం కొనసాగించేలా పర్యవేక్షించారు. ఈ మానవతా చర్యపై టి.ఆర్.పి రాష్ట్ర యువ నాయకులు వరిపల్లి అనిల్ కుమార్ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. "ఖాకీ వెనుక వెన్నెల్లాంటి మనసు ఉందని శ్రీనివాసు, ఖలీల్ నిరూపించారు. ఇలాంటి సేవలు పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచుతాయి" అని ఆయన కొనియాడారు. పోలీసుల సమయస్ఫూర్తి, మానవతా దృక్పథాన్ని స్థానిక ప్రజలు, ప్రయాణికులు వేనోళ్ల పొగుడుతూ"పోలీసు అంటే భయం కాదు, భరోసా" అని మరోసారి చాటిచెప్పిన ఈ ఘటనను ప్రశంసిస్తున్నారు.

## స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన






**స్టేషన్ ఘన్‌పూర్, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఈరోజు తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కళాశాలలోని తరగతి గదులు, మౌలిక వసతులు, బోధన విధానాలను పరిశీలిస్తూ కళాశాల కార్యకలాపాలపై వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీదేవసేన కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "విద్యార్థులు చదువును మధ్యలో ఆపకుండా, తమ లక్ష్యాలను సాధించే వరకు నిరంతరంగా శ్రమించాలి. ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం అవసరం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వంటి సంస్థలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని జీవితంలో విజయాలను సాధించాలి" అని సూచించారు. అలాగే కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ చంద్రమౌళి గారితో పాటు అధ్యాపక బృందాన్ని కమిషనర్ అభినందించారు. భవిష్యత్తులో కళాశాల సదుపాయాల విస్తరణకు, మౌలిక వసతుల అభివృద్ధికి తాను పూర్తి స్థాయిలో సహకరిస్తానని కూడా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కమిషనర్ సందర్శనను విజయవంతం చేశారు.

## వైభవంగా, సంప్రదాయబద్ధంగా ముగిసిన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర 2026

మొదటి పేజీ తరువాయి



ఏడాది జాతరలో లక్షలాది మంది భక్తులు దేశ నలుమూలల నుంచి తరలివచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు మేడారానికి చేరుకుని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాల శ్రేయస్సు, పంటల పుష్కలత, ఆరోగ్యం, శాంతి కోసం భక్తులు నిలువెత్తు బంగారం, కానుకలు సమర్పిస్తూ అమ్మవార్ల కృప కోరుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెలంగాణ ప్రభుత్వం అన్ని విభాగాల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. భద్రతా బందోబస్తు, వైద్య శిబిరాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రవాణా, విద్యుత్, సమాచార సేవలు వంటి మౌలిక సదుపాయాలను విస్తృతంగా ఏర్పాటు చేయడంతో జాతర ప్రశాంతంగా, సజావుగా కొనసాగింది. లక్షలాది మంది భక్తులు వచ్చినప్పటికీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మేడారం జాతర కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు ఇది గిరిజన సంస్కృతి, ప్రకృతి ఆరాధన, త్యాగ చరిత్ర, ప్రజల విశ్వాసాల ప్రతీక. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం 2026లో కూడా అదే ఘనతతో, అదే పవిత్రతతో కొనసాగి, కోట్లాది భక్తుల మనసులను కదిలించింది. ఈ విధంగా, సంప్రదాయబద్ధంగా, వైభవంగా, ఆధ్యాత్మిక పరవశంతో మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర 2026 ముగిసి, వన దేవతలు తిరిగి వనంలోకి ప్రవేశించడంతో మరో మహా అధ్యాయానికి ఘనంగా తెరపడింది.

## జాతీయ స్థాయి రాజకీయ శాస్త్ర సెమినార్‌కు ముఖ్య అతిథిగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి

**హన్మకొండ, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**


కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "భారతదేశంలో ప్రజాకర్షక విధానాలు" అనే అంశంపై ఫిబ్రవరి 16, 17 తేదీల్లో కేయూ సెట్ హాల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డిని విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య గారు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి స్పందించిన ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సెమినార్‌కు తప్పక హాజరవుతానని తెలిపారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో డాక్టర్ జి. కృష్ణయ్య (చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్), అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపల్లి నాగరాజు, అలాగే రీసెర్చ్ స్కాలర్ అంకెల శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ జాతీయ సెమినార్ ద్వారా భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాకర్షక విధానాల పాత్ర, రాజకీయాలపై వాటి ప్రభావం, ప్రజా సంక్షేమ విధానాల విశ్లేషణ వంటి అంశాలపై లోతైన చర్చ జరగనుంది. దేశవ్యాప్తంగా ప్రముఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఇందులో పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు.



## హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై భారీ ప్రమాదం

4 కి.మీ మేర ట్రాఫిక్ జామ్
యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద ఘటన
కంటైనర్‌ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్
క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్
సుమారు అరగంట పాటు శ్రమించి డ్రైవర్‌ను క్షేమంగా బయటకు తీసిన పోలీసులు

**యాదాద్రి భువనగిరి, జై భీమ్ న్యూస్**



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై ఈరోజు తెల్లవారుజామున భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఖైతాపురం వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఆయిల్ ట్యాంకర్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ ముందు క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడడంతో ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. డ్రైవర్‌ను బయటకు తీసేందుకు పోలీసులు సుమారు అరగంటకు పైగా శ్రమించారు. గ్యాస్ కట్టర్లు, ఇతర పరికరాల సహాయంతో క్యాబిన్ భాగాలను కట్ చేసి చివరకు డ్రైవర్‌ను క్షేమంగా బయటకు తీయగలిగారు. అనంతరం అతడిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదం కారణంగా విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై నాలుగు కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు క్రేన్ల సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే పనిలో నిమగ్నమయ్యారు.

## ఫాంహౌస్ లో కేసీఆర్ తో సమావేశమైన కేటీఆర్

ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కొనసాగుతున్న భేటీ
మున్సిపల్ ఎన్నికలు, సిట్ నోటీసులపై కొనసాగుతున్న చర్చ
కేసీఆర్ తో భేటీ అయిన హరీశ్ రావు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఎర్రవెల్లి ఫాంహౌస్ లో వీరి భేటీ కొనసాగుతోంది. మున్సిపల్ ఎన్నికలు, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు తదితర అంశాలపై వీరు చర్చిస్తున్నట్టు సమాచారం. కేసీఆర్ తో నిన్న హరీశ్ రావు భేటీ అయిన సంగతి తెలిసిందే. సిట్ అడిగే ప్రశ్నలు, సమాధాలు ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వీరు చర్చించినట్టు తెలుస్తోంది. కేసీఆర్ కు అందిన నోటీసులను ఎలా ఎదుర్కోవాలి, ఈ విషయాన్ని పార్టీకి నష్టం కలగకుండా ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి అనే అంశంపై నిన్న హరీశ్ తో, ఈరోజు కేటీఆర్ తో చర్చిస్తున్నట్టు సమాచారం. రాబోయే రోజుల్లో రాజకీయ పరంగా ఎలాంటి అడుగులు వేయాలి, ఎలాంటి ప్రజా ఉద్యమాలను నిర్మించాలి, మీడియా ముందుకు ఎలాంటి అంశాలను తీసుకెళ్లాలనే అంశాలపై చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ దూకుడు తగ్గించాలనే పట్టుదలతో ఉంది.



# కలికితురాయి ఆమె

మనోధైర్యానికి మారుపేరు,
నిజాయితీకి నిప్పు కనిక,
చెదరని చిరునవ్వుకు
కలల్ని కట్టిన స్వప్నం.

గుండె ధైర్యానికి మానవరూపం,
సాయానికి మదర్ తెరిసా,
ఉద్యమానికి ఉక్కుకనిక,
పోరాటానికి పుట్టిన యోధురాలు.

గజ్జె కడితే కళారూపిణి,
పాట పాడితే గానకోకిల,
అమ్మతనానికి నిలువుటద్దం,
సహనానికి జీవ సాక్ష్యం.

గాయాలను ఓర్చిన సహనశీలి,
కన్నీళ్లను కవితలుగా మలిచిన శక్తి,
నవ సమాజానికి ఆదర్శనీయంగా నిలిచిన నడిచే
ఉద్యమం.

నిలువెత్తు పోరాటాలే ఆమె స్వప్నం,
గుండె పగిలి నెత్తురొడ్డినా
వెనుకడుగేయని ధైర్యం,
నమ్మిన వారికి వెన్నంటే గుణం.

ఆమె ఒక పేరు కాదు
ఒక తత్వం, ఒక ఉద్యమం,
ఒక స్ఫూర్తి!

ఆమె
రజిని సాయిచంద్.

**జై భీమ్ న్యూస్, హైదరాబాద్:-**

ఆమె పోరాటప్రతిమకు ఎంతమంది అయినా సలాం కొట్టాల్సిందే.. ఒంటరితనంతో తాను పోరాడే తత్వం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుంది. ఆడదంటే అబల కాదు, సబల అని నిరూపిస్తున్న ధీర వనిత. రజిని సాయిచంద్ ప్రేమ కోసం కులాన్ని కాదని, ఉద్యమ పాటతో ఏకమై ప్రపంచాన్నే మేలుకొలిపింది. కులం కుళ్ళుతో కుళ్ళిపోయిన సమాజానికి ఆమె వివాహం ఒక ఆదర్శనీయం. నేడు నా వెంట నీవు లేకున్న నీ ఆశయాలతో నేనున్నానంటూ నడుంబిగించింది. తన ప్రయాణంలో ఒక అక్కగా, అమ్మగా, చెల్లిగా, బిడ్డగా ఓదార్చింది. చెమట చుక్కలనే కళ్ళాపిగా పోసి పూల బాట వేసింది. చుక్కల్లో చంద్రుడై పాటకు ప్రతిరూపంగా ప్రతిబింబించే సాయిచంద్ జీవిత ప్రయాణంలో భాగస్వామిగా తన జీవితాన్ని ఆయన లక్ష్యం వైపు తీసుకెళ్తూ సేవాపదంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటూ ఎంతో మంది మన్ననలు పొందుతుంది. తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నృత్యకారిణి వేద రజిని. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక వేదికలపై గజ్జెకట్టి నాట్యంతో ప్రజల్లో చైతన్యం నింపిన కళాకారిణిగా ఆమె పేరు మార్మోగింది.

**జననం:-**

1986 మార్చి 4న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో జన్మించిన వేద రజిని, జడ్చర్లలోని నాగార్జున హైస్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తిచేశారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించారు. విద్యార్థి దశ నుంచే కళల పట్ల ఆసక్తి కలిగిన ఆమె, ఉద్యమ కాలంలో నాట్యాన్ని ఆయుధంగా చేసుకుని ప్రజల్లో ఉద్యమ సందేశాన్ని తీసుకెళ్లారు. ప్రజల్లో ప్రజల మనిషిగా మారారు. ఆమెకు తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ గాయకుడు సాయిచంద్‌తో పరిచయం ఏర్పడింది. ఉద్యమ వేదికలపై ఇద్దరూ కలిసి పాటలు, నృత్యాలతో ప్రజలను ఉత్తేజపరిచారు. ఆ పరిచయం ప్రేమగా మారి, పెద్దల అంగీకారంతో 2012లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు చరీష్ (చెర్రీస్), కూతురు నది ఉన్నారు. అమ్మా అంటే తోడు విడువని బంధంగా వారిని ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచాలని నిత్య పోరాటం చేస్తూ.. అటు ప్రజా సేవకు..ఇటు మాతృత్వాన్ని సమపాళ్ళలో నడిపిస్తుంది. ఆమె అమ్మగా, కాళీ మాతగా, కల్కిగా, మారింది.

**రాజకీయ ప్రస్థానం..**

2023 జూన్ 29న ఆమె భర్త సాయిచంద్ గుండెపోటుతో తననుండి దూరమవ్వటం రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. ఆయన ఆట, పాట గుర్తులు ఆమెను చెక్కిన శిల్పంగా మార్చాయి. బాధ్యతలను గుర్తు చేస్తూ నేనున్నాను తోడు అంటూ సాయితో రోజు మాట్లాడేది. అదే బాధ్యతగా వేద రజినిని తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ 2023 జూలై 7న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె జూలై 20న అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. 2023 జూలై 7 నుంచి డిసెంబర్ 7 వరకు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వాలు పనితనాలు మారుతున్నాయి. అధికార వ్యామోహాలు ఏ రోజు చెంతకు చేరనివ్వలేదు. ప్రజాబాటే తన బాటగ, పార్టీ పిలుపే తన కర్తవ్యంగా, కేసీఆర్ నమ్మిన లీడర్ గా తన జీవితాన్ని పార్టీ కోసం కష్టపడుతూ వచ్చింది. మీకేం ఇష్టం అక్కా అని అడిగితే... పని తప్ప మరేం ఆశించని చెప్పిన గొప్ప మనసున్న మరో మనిషి.. ఇప్పుడు కూడా తాను బాధ్యత గానే భావిస్తూ, నమ్మకాన్ని నిలబెట్టేందుకు పయనమైంది. ఆమనగల్ మున్సిపాలిటీలో బీ ఆర్ ఎస్ కార్యకర్తలను ఏకం చేస్తూ పుర పోరుకు సిద్ధమైంది. ఎన్ని దెబ్బలు తగిలినా, విరగని మనసు,

**ఎన్ని అవమానాలు ఎదురైనా వెనక్కి తగ్గని స్వభావం,**

కష్టాల్లోనూ నిలబడే అచంచల ధైర్యం నేడు వేద రజిని సాయిచంద్ ఒక కలికితురాయి గా మన ముందుకు వచ్చింది..

**రచన:-** రాహుల్ కశ్యప్, 9951184676




## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వేగవంతానికి సీఈఓ ఆదేశాలు

### హనుమకొండలో వీడియో కాన్ఫరెన్సు

**హనుమకొండ, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

శనివారం హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్ ఎన్. రవితో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి శాతాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచే ఖచ్చితమైన వివరాలు సేకరించి ఓటర్లను సరైన పోలింగ్ స్టేషన్‌కు మ్యాప్ చేయాలని, బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) తప్పనిసరిగా ఫీల్డ్ విజిట్లు చేసి ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను ధృవీకరించాలని సూచించారు. మ్యాపింగ్ సమయంలో తప్పు ఎంట్రీలు, తప్పు లింకింగ్‌లు జరగకుండా కఠినమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్



ఏజెంట్లను వెంటనే నియమించుకోవాలని, ఓటర్ల సౌలభ్యం కోసం "బుక్ ఎ కాల్ (బుక్ ఎ కాల్)" సదుపాయంపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ప్రతి ఓటరు పేరు సరైన పోలింగ్ స్టేషన్‌కు మ్యాప్ కావడం ప్రజాస్వామ్యానికి కీలకం అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హనుమకొండ జిల్లాలోని రెండు నియోజకవర్గాల ఎస్ఐఆర్ పురోగతిని వివరించారు. జిల్లాలో పరకాల మరియు వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలు ఉండగా, పరకాలలో 78 శాతం, వరంగల్ పశ్చిమంలో 39 శాతం ప్రక్రియ పూర్తైందని తెలిపారు. ఇప్పటివరకు 76 వేల మంది ఓటర్ల వివరాలు మ్యాపింగ్ అయ్యాయని, ప్రస్తుతం పరకాల నియోజకవర్గం ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఈ వివరాలపై స్పందించిన సీఈఓ, బిఎల్ఓల ద్వారా క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ను మరింత వేగంగా పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్‌తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరపై తీవ్ర విమర్శల వెల్లువ

### ప్రెస్‌మీట్ రద్దుతో ప్రభుత్వ వైఫల్యం బహిర్గతం

**హైద్రాబాద్, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన సమ్మక్కసారలమ్మల మహాజాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర ఈసారి తీవ్ర విమర్శలు, వివాదాల మధ్య ముగిసింది. జాతర నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భక్తులు, మీడియా, సామాజిక వర్గాలు తీవ్రంగా ఆరోపణలు చేస్తున్నాయి. కోట్లాది మంది భక్తులు తరలివచ్చిన ఈ మహాజాతరకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చడంలో ప్రభుత్వ యంత్రాంగం తడబడిందని విమర్శకులు అంటున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, రహదారులు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు వంటి కీలక అంశాల్లో లోపాలు స్పష్టంగా కనిపించాయని జాతరకు వచ్చిన భక్తులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మేడారం జాతర అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, తెలంగాణ గిరిజన సంస్కృతి, ఆత్మగౌరవం, విశ్వాసాలకు ప్రతీక. అలాంటి మహాజాతరను సమర్థంగా నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్న భావన ఇప్పుడు విస్తృతంగా వ్యక్తమవుతోంది. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొన్ని ప్రాంతాల్లో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయిందని, అత్యవసర వాహనాలకు కూడా మార్గం లేకపోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. "భక్తితో వచ్చాం, కానీ ప్రభుత్వం మాకు నరకం చూపించింది" అన్న మాటలు జాతర ప్రాంగణంలో వినిపించడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తోందని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వివాదాలకు మరింత ఆజ్యం పోసింది జాతర ముగిసిన అనంతరం జరగాల్సిన మంత్రి మీడియా సమావేశం రద్దు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దాసరి అనసూయ (సీతక్క) మేడారం జాతర పూర్తైన తర్వాత మీడియాతో మాట్లాడటం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈసారి ఆ ప్రెస్‌మీట్‌ను అకస్మాత్తుగా రద్దు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మీడియా ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం లేకే ఈ నిర్ణయం తీసుకున్నారని సీనియర్ జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. "జాతర విజయవంతమైందని ప్రభుత్వం భావిస్తే, మీడియా సమావేశం ఎందుకు రద్దు చేశారు?" అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మార్మోగుతోంది. రాష్ట్ర అధికారిక పండుగగా గుర్తింపు పొందిన మేడారం జాతరపై ఇలాంటి విమర్శలు రావడం ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాన్ని దుమ్మెత్తిపోస్తూ, ఇంతటి మహా ఉత్సవాన్ని నిర్వహించలేకపోవడం పాలన సామర్థ్యంపై పెద్ద ప్రశ్నగా నిలుస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. గిరిజనుల ఆరాధ్య దేవతల జాతరను ఇంత నిర్లక్ష్యంగా నిర్వహించడం రాష్ట్రానికి అవమానమని కూడా పలువురు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే, ఈసారి మేడారం జాతర భక్తి, ఆధ్యాత్మిక ఉత్సవం కన్నా పరిపాలనా వైఫల్యానికి చిహ్నంగా మారిందన్న విమర్శ బలంగా వినిపిస్తోంది. ప్రభుత్వ ఏర్పాట్లలో లోపాలు, భక్తులకు కలిగిన ఇబ్బందులు, మంత్రి ప్రెస్‌మీట్ రద్దు వంటి అంశాలు కలిసి జాతర నిర్వహణపై పెద్ద మచ్చగా మిగిలిపోయాయి. ఇప్పుడు అందరి దృష్టి ఒకటే ప్రభుత్వం ఈ విమర్శలపై ఎలా స్పందిస్తుంది? జరిగిన లోపాలకు బాధ్యత వహిస్తుందా? లేక ఈ వివాదాన్ని కాలంతో మరిచిపోయేలా వదిలేస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే.

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి కృతజ్ఞతలు

### సిఎం సహాయనిధి చెక్కు అందజేత
### మాజీ వైస్ ఎంపీపీ గుర్మిట్కల్ మల్లేశం



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని మోత్కూరు గ్రామానికి చెందిన సిద్ది రాములు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఆయనకు రూ. 19,000 వేలు సీఎం సహాయనిధి నుంచి, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి ఆదేశానుసారం, ఎం ఎల్ సి నవీన్ రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కును దోమ మండల మాజీ వైస్ ఎంపీపీ గుర్మిట్కల్ మల్లేశం ఈ రోజు రాములుకు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు సంపల్లి మల్లేశం, మాజి ఉప సర్పంచ్ కరణం శ్రీకాంత్ రావు, సుధాకర్ రెడ్డి, గుణిగారి అంజయ్య, బైండ్ల రమేష్, బంక చెన్నయ్య వెంకటయ్య, పెంటయ్య, లక్ష్మయ్య, రాములు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోమలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గద్దర్ 77వ జయంతి వేడుకలు



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల గొంతుకగా పాటై గర్జించి, తన స్వరాన్ని ఆయుధంగా మలిచి పీడితుల కోసం పోరాడిన, దొరల దోపిడీలపై తిరగబడ్డ రాగం, అసమానతలపై మర్లబడ్డ గానం, సామాజిత్ సామాజిక చైతన్యమై ఎగసిన కిరీటం తెలంగాణ ఉద్యమ గీతం, పొడిచే పొద్దులో నడిచే కాలంలో నిత్యం ప్రతిధ్వనించే విప్లవ స్వమని దోమ కమిటీ ఆధ్వర్యాలో కవి, గాయకులు, సామాజిక ఉద్యమకారుడు ప్రజా యుద్ధనౌక గద్దర్ అని చెప్పుకొచ్చారు దోమ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు. ఈరోజు ఉద్యమకారుడు గద్దర్ 77వ జయంతి సందర్భంగా.. దోమ మండలంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆయన ఫోటోకు పూలమాల వేసి ఆయన జయంతి జరిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దోమ మండల ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షులు ఆర్, బందయ్య మాదిగ, ఉపాధ్యక్షులు బొంపల్లి వెంకటేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి దోర్నాలపల్లి శ్రీనివాస్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎక్కి రాములు మాదిగ, కార్యదర్శి గుడికొనపల్లి నర్సింలు, కోశాధికారి లక్ష్మణ్ మాదిగ, దోమ డప్పు రమేష్ మాదిగ, దిర్సంపల్లి రాములు మాదిగ, డప్పు యాదయ్య మాదిగ, అయినాపూర్ పూలే అంబేద్కర్ యువజన సంఘం ఏర్పుల శ్రీనివాస్, అఖిల్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఎస్‌బీఐలో 2,273 ఉద్యోగాలు

### బ్యాంకింగ్ అనుభవం ఉన్నవారికి భారీ అవకాశం

**హైద్రాబాద్, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్**




దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 2026 సంవత్సరానికి సంబంధించి భారీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాంకులో సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ (సీబీఓ) పోస్టుల భర్తీ కోసం మొత్తం 2,273 ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానించింది. బ్యాంకింగ్ రంగంలో ఇప్పటికే అనుభవం ఉన్న అభ్యర్థులకు ఇది అరుదైన గొప్ప అవకాశం అని అధికారులు తెలిపారు. ఈ నియామక ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనుండగా, ఎంపికైన అభ్యర్థులకు వారు అప్లై చేసిన సర్కిల్‌లోనే పోస్టింగ్ ఇవ్వనున్నారు. దీని వల్ల స్థానిక భాష, ప్రాంత పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులకు మరింత ప్రయోజనం కలగనుంది. నోటిఫికేషన్ ప్రకారం, ఈ పోస్టులకు దరఖాస్తులు 29 జనవరి 2026 నుంచి ప్రారంభమవుతాయి. చివరి తేదీ 18 ఫిబ్రవరి 2026గా నిర్ణయించారు. ఆన్‌లైన్ రాత పరీక్షను మార్చి 2026లో నిర్వహించే అవకాశముందని బ్యాంక్ వర్గాలు తెలిపాయి. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీ కలిగి ఉండాలి. అలాగే షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ లేదా ఆర్ఆర్‌బీ (ఆర్.ఆర్.బి)లో కనీసం రెండు సంవత్సరాల ఆఫీసర్ అనుభవం తప్పనిసరి. వయో పరిమితి 31-12-2025 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీడబ్ల్యూడీబీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయో సడలింపు వర్తిస్తుంది. ఎంపికైన అభ్యర్థులకు ₹48,480/- ప్రాథమిక జీతంతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ, సీసీఏ, ఎన్‌పీఎస్, మెడికల్, ఎల్ఎఫ్‌సీ వంటి అనేక అలవెన్సులు లభిస్తాయి. దీంతో ఈ ఉద్యోగం ఆర్థికంగా కూడా ఎంతో ఆకర్షణీయంగా మారింది. ఎంపిక ప్రక్రియ నాలుగు దశల్లో జరుగుతుంది. ముందుగా ఆన్‌లైన్ రాత పరీక్ష (ఆబ్జెక్టివ్, డెస్క్రిప్టివ్), తరువాత స్క్రీనింగ్, ఆపై ఇంటర్వ్యూ, చివరగా లోకల్ లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ అన్ని దశల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులనే తుది ఎంపిక చేస్తారు. దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో పని చేస్తున్న అధికారులకు ఈ నోటిఫికేషన్ ఒక గొప్ప అవకాశంగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులో స్థిరమైన ఉద్యోగం, మంచి జీతం, భవిష్యత్తు భద్రత కోరుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

# రైతులకు అందుబాటులోకి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్

**హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్**

**హనుమకొండ, జనవరి 31, 2026 (జై భీమ్ న్యూస్)**

రైతులు యూరియా కోసం క్యూలైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా సులభంగా బుక్ చేసుకునే విధంగా ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ అందుబాటులోకి వచ్చిందని హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్‌లో లభ్యమయ్యే ఈ యాప్ ద్వారా రైతులు తమ అవసరానికి అనుగుణంగా యూరియాను ముందుగానే బుక్ చేసుకునే సౌకర్యం కల్పించామని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులు సంబంధిత డీలర్ వద్ద 24 గంటల్లోపు ఎరువును కొనుగోలు చేయవచ్చని, నిర్ణీత సమయంలో తీసుకోకపోతే బుకింగ్ ఆటోమేటిక్‌గా రద్దు అవుతుందని చెప్పారు. యూరియా బుకింగ్ చేసిన వెంటనే పట్టాదారు పాస్‌బుక్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుందని వివరించారు. పట్టా భూమి యజమానులు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులు, నాన్ పట్టా /ఎన్.డి.ఎస్ రైతులు, కౌలు రైతులు ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఎరువు తీసుకునే సమయంలో రైతులు తమతో పాటు బుకింగ్ ఐడి మరియు ఆధార్ కార్డు తీసుకువెళ్లాలని సూచించారు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ అమలుతో దళారీ వ్యవస్థకు చెక్ పడుతుందని, పంపిణీ మరింత పారదర్శకంగా మారుతుందని రవీందర్ సింగ్ అన్నారు. ఎవరైనా దళారులను నమ్మవద్దని హెచ్చరిస్తూ, యూరియా పంపిణీలో సమస్యలు తలెత్తితే సంబంధిత వ్యవసాయ అధికారి లేదా 8977756348 నంబర్‌ను సంప్రదించాలని రైతులకు సూచించారు. జిల్లాలో యాప్‌ను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం, దాని అమలు తీరును పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ ధర్మసాగర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్), గ్రోమోర్ సెంటర్లను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేష్, టెక్నికల్ ఏవో కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న రూ.16 లక్షల బంగారాన్ని తిరిగి అందజేసిన వేలేరు పోలీసులు

**వేలేరు, 31 జనవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**



వేలేరు మండలంలో పోలీసులు చూపిన అపూర్వమైన చురుకుదనం, నిజాయితీ మరోసారి ప్రజల విశ్వాసాన్ని బలపరిచింది. సుమారు రూ.16 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు ఆభరణాలతో కూడిన బ్యాగ్‌ను వేలేరు పోలీసులు బాధితులకు సురక్షితంగా తిరిగి అందజేశారు. వివరాల్లోకి వెళ్తేడ వేలేరు మండల కేంద్రానికి చెందిన గంజి రమేష్ బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి నిన్న మధ్యాహ్నం లింగంపల్లి సమ్మక్కసారలమ్మ జాతరకు కారులో బయలుదేరారు. ప్రయాణం ప్రారంభానికి ముందు మినరల్ వాటర్ ట్యాంక్ నింపుకునే సమయంలో, కారులోని డిక్కీలో ఉంచిన బంగారు ఆభరణాల బ్యాగ్ అనుకోకుండా కింద పడిపోయింది. ఇది గమనించని రమేష్ బాబు జాతరకు వెళ్లిపోయారు. తిరుగు ప్రయాణంలో కారును పరిశీలించినప్పుడు బ్యాగ్ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన బాధితుడు ఇంటిలో కూడా వెతికినా దొరకలేదు. దీంతో రోడ్డు మార్గంలో ఎక్కడో పడిపోయి ఉండవచ్చని అనుమానించి, ఈరోజు ఉదయం వేలేరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్సై సురేష్ కుమార్ నేతృత్వంలో సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించగా, సదర్ రోడ్డుపై పడిపోయిన బ్యాగ్‌ను అక్కడే ఉన్న ఓ వ్యాపారి తీసుకున్నట్లు గుర్తించారు. వెంటనే ఆ వ్యాపారిని గుర్తించి, అతని వద్ద నుంచి బంగారు ఆభరణాల బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని, బాధిత దంపతులకు ఎస్.ఐ చేతుల మీదుగా సురక్షితంగా అందజేశారు. పోయిన బంగారాన్ని అతి తక్కువ సమయంలో గుర్తించి తిరిగి అందజేసిన వేలేరు పోలీసుల చురుకుదనానికి, నిజాయితీకి బాధితులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనతో ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత బలపడింది.

## పదవీవిరమణ అనంతరం కుటుంబంతో విలువైన సమయం గడపండి : అదనపు డీసీపీ రవి



**వరంగల్, 31 జనవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు శనివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ రవి మాట్లాడుతూ, పదవీవిరమణ అనంతరం పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపాలని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంతమైన జీవితం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన అధికారుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్లు బుచ్చిరెడ్డి, సంజీవరావు, ఆనందం, అలాగే ఏఆర్ ఎస్ఐ బీర్ దేవ్ ఉన్నారు. వీరికి అధికారులు శాలువాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. అదనపు డీసీపీ మాట్లాడుతూ, సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు సేవలందించిన ఈ అధికారులు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. అలాగే, పదవీవిరమణ తర్వాత ప్రభుత్వం నుండి అందే డబ్బును భవిష్యత్తు అవసరాలకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. స్పర్జన్ రాజ్, సూపరింటెండెంట్ జలజ, ఆర్.ఎస్.ఐ. శ్రవణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రవణ్, ఇతర పోలీస్ సిబ్బంది, అలాగే పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ వీడ్కోలు సభ సాన్నిహిత్యంతో, భావోద్వేగాలతో స్మరణీయంగా కొనసాగింది.

## సమ్మక్కసారలమ్మ జాతర హుండీ లెక్కింపు పూర్తి

**1 లక్షకు పైగా ఆదాయం**

**భీమదేవరపల్లి / కొత్తకొండ, 31 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలో ఉన్న అమ్మవారి ఆలయంలో జరిగిన ఈ లెక్కింపులో భక్తులు సమర్పించిన విరాళాల ద్వారా గణనీయమైన ఆదాయం లభించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, హుండీలో నోట్ల రూపంలో ₹86,910, నాణేల రూపంలో ₹12,578 లభించగా, మొత్తం హుండీ ఆదాయం ₹69,488 గా నమోదైంది. అంతేకాకుండా జాతర సందర్భంగా విక్రయించిన దర్శన టికెట్ల ద్వారా ₹31,410 ఆదాయం వచ్చింది. ఈ రెండింటిని కలిపి మొత్తం ₹1,00,898 రూపాయలు అమ్మవారి హుండీకి జమయ్యాయి. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించగా, ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులు స్వచ్ఛందంగా సమర్పించిన ఈ విరాళాలను ఆలయ అభివృద్ధి, అమ్మవారి సేవా కార్యక్రమాలు మరియు భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు వినియోగిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారి పి. కిషన్ రావు మాట్లాడుతూ, జాతరను విజయవంతంగా నిర్వహించడంలో భక్తులు, గ్రామ ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు అందించిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ ఏడాది జాతర మరింత ఘనంగా సాగిందని ఆయన అన్నారు.

# రోడ్డుపై ప్రతి ప్రాణం విలువైనదే





**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సభలో డ్రైవర్లకు కీలక సందేశం**

**హన్మకొండ, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం హనుమకొండలో ఘనంగా జరిగింది. జీఎస్ రోడ్ సేఫ్టీ అసోసియేషన్ అధ్యక్షులు మరియు విద్యా సంస్థల బస్ అసోసియేషన్ అధ్యక్షులు గాదె స్వరూప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్కూల్ బస్సు డ్రైవర్లు, టాటా మాజిక్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై డ్రైవర్లకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎం.వి.ఐ) కిషోర్ బాబు మాట్లాడుతూ, "మనమంతా రోడ్డుపై నడిపే ప్రతి వాహనం వెనుక ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు దాగి ఉంది. కాబట్టి ప్రతి డ్రైవర్ అత్యంత జాగ్రత్తగా, నియమ నిబంధనలకు అనుగుణంగా వాహనం నడపాలి. ప్రమాదాల్లేని డ్రైవింగ్ ద్వారానే సమాజానికి నిజమైన సేవ చేయగలం" అని అన్నారు. పది సంవత్సరాల పాటు ఎలాంటి ప్రమాదం జరగకుండా వాహనం నడిపిన డ్రైవర్లకు ప్రత్యేక అవార్డులు ఇవ్వాలని ప్రతిపాదించడం ద్వారా డ్రైవర్లలో మరింత బాధ్యతా భావాన్ని పెంపొందించాలన్న ఉద్దేశాన్ని వ్యక్తం చేశారు. గాదె స్వరూప్ రెడ్డి మాట్లాడుతూ, స్కూల్ బస్సు డ్రైవర్ల పాత్ర ఎంత కీలకమో వివరించారు. "ఒక స్కూల్ బస్సులో 40 నుంచి 50 మంది పిల్లలు ప్రయాణిస్తుంటారు. వారి ప్రాణ భద్రత పూర్తిగా డ్రైవర్ చేతుల్లోనే ఉంటుంది. ఒక చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చు. అందుకే ప్రతి డ్రైవర్ తాను తన కుటుంబాన్ని రక్షిస్తున్నట్టు భావించి బస్సును నడపాలి" అని సూచించారు. డీటీఓ వేణుగోపాల్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, వేగ నియంత్రణ, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పిస్తూ, "రోడ్డు భద్రత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి వాహనదారుడి కర్తవ్యము కూడా" అని పేర్కొన్నారు. కార్తీక్ ఉదయ్ కూడా మాట్లాడుతూ రోడ్డు మీద జాగ్రత్తలు పాటించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. కార్యక్రమం చివరిలో శ్రావ్య ఆధ్వర్యంలో అందరి చేత రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించి, ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తామని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డా. బండి సదానందం (ఎన్‌హెచ్ఆర్‌సీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు), అసోసియేషన్ సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, రమణారెడ్డి, హైమద్, ఆరోగ్య రెడ్డి, దయాకర్ రెడ్డి, భాస్కర్, పల్లవి, జంగిరి కమలాకర్ రెడ్డి, అలాగే కానిస్టేబుళ్లు శ్రీనాథ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. అంతేకాకుండా హంటర్ రోడ్ ప్రాంతంలో కూడా రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వాహనదారులు, ప్రజలకు ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిన అవసరంపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా "ప్రమాద రహిత రోడ్లు సురక్షిత సమాజం" అనే లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పం మరింత బలపడిందని నిర్వాహకులు తెలిపారు.

## మేడారంలో భక్తుల ఇక్కట్లు

**బస్టాండ్‌లో ఉధృతమైన ఆందోళన**

**"ఇది జాతరాడ లేక శిక్షా?" అంటూ ప్రభుత్వంపై మండిపడిన భక్తులు**

**మేడారం, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రపంచ ప్రఖ్యాత సమ్మక్కసారలమ్మ మహాజాతరకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం స్వస్థలాలకు వెళ్లేందుకు మేడారం బస్టాండ్‌కు చేరుకున్న భక్తులు, అక్కడ ఏర్పాట్ల లోపాల వల్ల ఆవేదనకు గురై శుక్రవారం పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. తాగునీరు, నీడ, మరుగుదొడ్లు, బస్సులు వంటి కనీస సదుపాయాలు కూడా సరిపడా లేకపోవడంతో భక్తులు "ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడారం నుంచి హనుమకొండ, వరంగల్, హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు తగిన సంఖ్యలో లేకపోవడంతో భక్తులు గంటల తరబడి బస్టాండ్‌లోనే నిరీక్షించాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చిన కుటుంబాలు మరింత కష్టాలను ఎదుర్కొంటున్నాయి. కొందరు భక్తులు అలసటతో నేలపైనే కూర్చుని, మరికొందరు రోడ్లపైనే పడుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. బస్టాండ్ పరిసరాల్లో తాగునీటి పాయింట్లు సరిపడా లేకపోవడం, నీడకు షెడ్లు లేకపోవడం, మరుగుదొడ్లు తక్కువగా ఉండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. వేలాది మంది ఒకేచోట గుమిగూడటంతో పరిశుభ్రత లోపించి, దుర్వాసనతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. "అమ్మవారి దర్శనం ఎంతో ఆనందం ఇచ్చిందిడ కానీ తిరుగు ప్రయాణంలో ప్రభుత్వం మాకు నరకం చూపిస్తోంది" అని ఓ వృద్ధ భక్తుడు వేదనతో అన్నాడు. భక్తులు ధర్నాకు దిగడంతో కొంతసేపు మేడారం బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రవాణా స్తంభించింది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించినప్పటికీ, సరైన బస్సులు, మౌలిక సదుపాయాలు కల్పించే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని భక్తులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, నీడ, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. సమ్మక్కసారలమ్మ జాతర వంటి అపూర్వమైన ఆధ్యాత్మిక వేడుకలో ఇలాంటి అవ్యవస్థలు చోటుచేసుకోవడం రాష్ట్ర ప్రతిష్ఠకే మచ్చగా మారిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భక్తుల కష్టాలను తొలగించాలని వారు కోరుతున్నారు.

## ఆత్మహత్య నుంచి మహిళను కాపాడిన ట్రాఫిక్ హోంగార్డ్ అమీన్

**వరంగల్‌లో మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం**

**వరంగల్, 31 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



వరంగల్ నగరంలో మానవత్వాన్ని చాటిన సంఘటన చోటు చేసుకుంది. పాత బీట్ బజార్ ప్రాంతంలో ట్రాఫిక్ డ్యూటీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డ్ అమీన్ అప్రమత్తతతో ఒక మహిళ ప్రాణాలు నిలిచాయి. శనివారం ఉదయం, రైల్వే పట్టాల వైపు వేగంగా వెళ్తున్న ఓ మహిళను గమనించిన అమీన్‌కు అనుమానం కలిగింది. వెంటనే ఆమెను ఆపి వివరాలు అడగగా తన పేరు సువర్ణ, భర్త పేరు కోటేశ్వర్ అని, తాము వరంగల్ హాస్పిటల్ వెనుక ఉన్న ఎల్బీనగర్ ప్రాంతంలో నివసిస్తున్నామని తెలిపింది. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో రైల్వే పట్టాల వద్దకు వచ్చానని కన్నీళ్లతో చెప్పింది. అమీన్ గారు ఎంతో ఓర్పుతో ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఆమె కుమారుడికి ఫోన్ చేసి వెంటనే రావాలని, అలాగే ఆమె సోదరిని కూడా తీసుకురావాలని సూచించారు. వారు అక్కడికి వచ్చిన తరువాత, కుటుంబ సభ్యులందరికీ పరిస్థితిని వివరించి, మనోధైర్యం నింపుతూ మరింత కౌన్సిలింగ్ చేశారు. చివరికి సువర్ణను భద్రంగా కుటుంబ సభ్యుల చేతికి అప్పగించారు. ఈ సంఘటన అక్కడున్న ప్రజలందరినీ కదిలించింది. ఒక ప్రాణాన్ని కాపాడిన ట్రాఫిక్ హోంగార్డ్ అమీన్ మానవీయతను చూసి స్థానికులు ఆయనను హృదయపూర్వకంగా అభినందించారు.